


# దోమలు

పి.యస్.నారాయణ

ఆ మూడంతస్థుల 'శ్రీ నిలయం' లో తూర్పువైపు కిటికీలోనుంచి యూఫోమ్ బెడ్ మీద పడుకొని పైకి చూస్తే నక్షత్రాలు ముత్యాల పందిరిలా కనపడుతున్నాయి. ఓ వైపున తెల్లటి మబ్బు ముక్క చూస్తే ఆకాశం మీద హంసల రథంలా పరుగెడుతున్నది. దూరంగా అవతల వీధిలో వున్న ఆరంతస్థుల మేడ పైనుంచి పందిరి పడిపోకుండా పెట్టిన స్తంభానికి ట్యూబ్ లైట్లు కట్టినట్లుగా వున్నది.

కిటికీకి వేసిన గులాబీరంగు కర్టెన్ గుడ్డ అందమైన శశిరేఖ ముఖం కందిపోతుందేమోనని ఎండకు అడ్డుపెట్టిన అరవాళ్ళ గొడుగులా వున్నది. గదిలో వెలుగుతున్న చిన్న నీలం బల్బు చీకటి రహస్యాలకు తెరలు కట్టినట్లుగా వున్నది. గంట క్రితం పాలరాతి టబ్‌లో జాస్మిన్ సువాసనల నడుమ స్నానం చేసి వంటికి పట్టించిన సెంటెడ్ పౌడర్ శశిరేఖ శరీరాన్ని ఆరుబయట వెన్నెల్లో ఎగిరిపొమ్మంటున్నది.

లంగా లేకుండానే చుట్టుకున్న ఉల్లిపొర తెల్లచీరె శశిరేఖకు రాళ్ళమీద పడుతున్న నీళ్ళ ప్రవాహపు నురగలా వున్నది. చీరకు పైగా మెడకు క్రిందగా

బెత్తెడు వెడల్పున ఉన్న చేతుల్లేని తెల్ల జాకెట్టు ఏమీ తోచని పనిలేని పెద్ద మనిషి మంచుగడ్డల్ని గుడ్డలో వేసి బరబరా నలిపేస్తున్నట్లున్నది.

అప్పుడప్పుడూ ముఖం మీద గిర్రున తిరిగి మాయమవుతున్న దోమ క్రిందంతస్థులలో దాచిపెట్టిన బ్లాక్ మనీని గుర్తుకు తెస్తున్నది. దాన్ని చంపేందుకు ఉండి ఉండి శశిరేఖ కొడుతున్న చప్పట్లు 'ఆ యింటిమీద ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసరు రెయిడ్ చేసినట్లున్నది.

దోమ దొరక్కపోగా కందిన శశిరేఖ చేతులు ఆమె మొహానికి ప్రతీకగా వున్నాయి. రెండుసార్లు చంద్రశేఖరం అరగంటక్రితం త్రాగిన ఫారిన్ లిక్కర్ సీసాలా అటూ యిటూ జోగింది విసురుగా విస్గుగా ఆ మంచంమీద శశిరేఖ

వెధవదోమ తనకు దొరకకుండా పోతోంది!...

'రేపు మూర్తిని డిస్‌మిస్ చేయించాలి!'

ఇల్లంతా మందు కొట్టించాడు—వెధవ కంపొకటి — దోమలు చావక పోంగా!

నైలాన్ దోమతెర నడుమ వెల్లికిలా పడుకొని—కిటికీకి వున్న ఎయిర్ కూలర్‌ను అన్ చేద్దామా అనుకొని అటు వైపుకు సుతారంగా వంగి—మళ్ళా వెనక్కు జారిపోయి—వెధవ దోమ తలుపులు బిగిస్తే బయటకెలా వెళ్తుంది అనుకొని ఒక మూలుగు మూలిగింది అంతకు మించిన భయం మరొకటి వున్నది ఆమె మనస్సులో. ఆవిడగారి చంద్రశేఖరం—కూలర్ ఆన్ చేయగానే—ఒక కులుకు కులికి—'రేఖా మేడమ్! మరీ చలిగా వుందోయ్...ఏదీ ఒక్క పెగ్గుపోయి—' అని ముద్దులు గుశిచేస్తాడు—వెధవది పోసిందే అనుకో—త్రాగినవాడు త్రాగినట్లు పడివుండక వెధవ గోలానూ—వెధవ వాసనానూ...

"సారూ...దోమ!" దీర్ఘం తీస్తూ లేచి నిలబడింది శశిరేఖ. ఆమె లేచి నిలబడితే అజంతా శిల్పమే ఎక్కడ్నించో లేచి వచ్చినట్లనిపించింది రెండు రౌండ్లకే చంద్రశేఖరానికి

"ఎక్కడ?"

"నా తలమీద—ఎందుకూ వెధవ మేనేజింగు డైరెక్టరని చెప్పుకోవడమూ—ఓ దోమల్ని ఇంట్లోకి రానీయకుండా చేయలేకపోయావ్!" ఆయన గారికి మరో రెండు సంగతి గుర్తుకు రాకుండా పమిట జార్చేసి చేతులెత్తేసింది శశిరేఖ.

"మూర్తి పెస్ట్‌కంట్రోల్ వాళ్ళను పిలిపించి మందు కొట్టింకానన్నాడు గదా!"

"అయ్యగారు అద్దంకి వెళ్ళనూ వెళ్ళారు...రానూ వచ్చారట—అలా

వుంది ఆయనగారు మందు కొట్టించడం ......!"

"— యూన్‌లెస్ బిగ్గర్ ... రేపే డిస్మిస్ చేస్తానుందు వాడిని..."

"రేపటి సంగతి సరే......ఇవ్వాళ ఎలా పడుకోవడం ఇక్కడ?"

నిశ్శబ్దం ... శశిరేఖకు దూరంగా రాత్రంతా పడుకోవాలేమోనన్నంత భయంగా వున్నది. అంతేగాకుండా ఆ దోమ కారణంగా రాత్రికి తాను శశిరేఖ దగ్గర పడుకోకపోతే తాను వట్టి వెధవని పించింది!

చంద్రశేఖరం సీరియస్‌గా ఫోనున్న టేబిల్ దగ్గరకు నడిచాడు. లిఫ్ట్ చేసి దాన్నే చూస్తూ డయిల్ చేశాడు

"యస్...ఇంద్రలోక్!" కాక్‌టైల్ మత్తులా కంఠం వున్నది.

"చంద్రశేఖరం స్పీకింగ్!"

"ఏ చంద్రశేఖరమండీ?"

"శేఖర్ అండ్ శేఖర్ మేనేజింగ్ డైరెక్టర్!"

"హో మైగాడ్ ... ఎక్కడనుంచీ చల్లని మాటలు ... అబ్బా అదే ఆశో చిస్తున్నాను ... ఎక్కడ నుండో పిల్ల తెమ్మెరలు ఒకచే వచ్చేస్తున్నయ్యని...

"...ఈనాడెంతసుదినం... ఈరోజు ఉదయాన లేస్తూనే..." కంఠంలో తడబాటు...ఆనందం...ఆశ...

"డబుల్ రూం ... అరగంటలో వస్తున్నాను!"

"ఎవ్వరో ఆ అదృష్టవంతురాలు!" ఈర్ష్యకు మరోపేరు ఆ ప్రశ్న...

డోన్ట్ బీ సిల్లీ..." చాలా చిన్నగా గొణిగాడు. కంఠం హెచ్చిస్తూ, "మిసెస్ చంద్రశేఖరం కూడా వస్తు న్నారు" అన్నాడు.

"ఓ...ఐసీ...అయితే మేం కననిది మన్నమాట...ఎనీ స్పెషల్ ఎరేంజి మెంట్స్ ప్లీజ్!"

"మేం వచ్చిన అయిదు నిముషాల్లో రెండు ఐస్ క్రీంలు పంపు ... చాలు ...అంతే! ఆఁ...అవును...హోటల్లో దోమలు లేవుగదా?..."

"నో...నాటెటాల్!"

"ఓకే..."

"ఓకే...సార్...సారూ—"

"యస్..."

"నాది నైట్ డ్యూటీ ... ... నేను కంప్లీట్ నైటంతా ఇక్కడే వుంటాను సార్...!" ఆడవాని ఆఁహాంటి అంద మైన కంఠానికి ఎంతటి మొగాడయినా ఔటయిపోతాడని ఆమె అనుభవ నిఘం టువులో ప్రతి పేజీలోనూ రాసిపెట్టి వున్నది.

ఫోన్ పెట్టేశాడు చంద్రశేఖరం ఏం మాట్లాడకుండా.

"డియర్ రేఖా ... కమాన్ ... 'ఇంద్రలోక్'లో రెండు మంచాల పెద్ద గది మనకోసరం రెడీగా వున్నది... కమాన్ ఐసే...!"

* * *

సుజాత మీదగా కిటికీలో నుంచి ఆకాశంలోకి చూస్తే నక్షత్రాలు బియ్యం అయిపోయిన ఖాళీ జల్లెడలా వున్నాయి. ఓ పక్కగా ఆకాశం మీద పోతున్న తెల్లటి మబ్బు పెళ్ళినాటి సుజాత తెల్ల చీర చిరిగి ఎగిరిపోతున్నట్లనిపిస్తోంది. దూరంగా పైకి పాకుతున్న మేడ ఏమరుపాటుగా వుండే మీద పడే దయ్యంలా వున్నది.

కిటికీకి కర్టెన్‌లా కట్టిన మాసిన పెద్దపూల చీరముక్క—ఆ పాత డాబా కొంపకు రంగు కాగితాలు అంటించి నట్లున్నది.

వెలిసిపోయిన ఎర్రంచు నల్ల చీరలో సుజాత పోషణలేక గుహల్లో ఎండకూ వానకూ పడివున్న శిలా విగ్రహంలా వున్నది. ఆమె పొడవైన నల్లటి నొక్కుల నొక్కుల జడ ఆ గుడ్డివెలుగులో త్రాచులా వాళ్ళిద్దరి నడుమా పడి వున్నది.

ఆమె వుండి వుండి నంగినంగిగా మాట్లాడే మాటలు మేడమీద పడుకున్న పిల్లలు ఎప్పుడు క్రిందకు వస్తారో అన్నంత భయంగా వున్నాయి. ఆమె మాటిమాటికీ ఇంటి కప్పు వంక కళ్ళార్పుతూ చూస్తున్న చూపులు తాము ఎప్పటికైనా ఓ దోమ తెరను కొనుక్కో గలమా అనే సంశయాన్ని చాటు తున్నాయి.

"పైకి పోదామండీ!"

"ఎందుకో...?"

ఆమెకు అసలే విసుగ్గా వున్నది... పగలంతా కాళ్ళూ చేతులూ కొట్టుకుని పనిచేసి చస్తే...కాస్త సుఖంగానైనా నిద్రపోనీయకుండా వెధవ దోమ లొకటి —దేనికైనా అదృష్టముండాలి! వెధవ బ్రతుకు—

"సిగ్గులేకపోతేసరి ... వీళ్ళు మీద పడుతున్నాయి ...... ఇంకా ఎందుకట ఎందుకు...పైన పిల్లలున్నారనే జ్ఞానం గూడా లేకుండా ఇద్దరం కలిసి ఓ గదిలో జేరి తలుపులు బిగించుకుంటే సరి పోయిందా—" బుగ్గలమీద పొడిచింది చికాగ్గా రామం మొహంలోకి చూస్తూ.

"వోయ్...వోయ్...ఇదెప్పటినుంచి ...?" ఆమె నడుం మీద చేయివేసి తన దగ్గరకు బలంగా లాక్కున్నాడు రామం.

"ఊఁ...దూరంగా పడుకోండి—నన్ను మాట్లాడించవద్దు......సిగ్గులేని వాళ్ళకు బోడినవ్వే సింగారంట!" వెనక్కు జరుగుతూ మీదపడ్డ చేతిని బలంగా తీసిపారేసింది సుజాత.

రామం ఓ పెద్ద ఆఫీసులో చిన్న గుమాస్తా. పెళ్ళయి యిద్దరు పిల్లలు పుట్టి వాళ్ళు పెద్దవాళ్ళయినా—సీనియా రిటీ అడ్డంవచ్చి...అతడికి ప్రమోషన్ రాలేదు. పిల్లలు పెరుగుతున్నట్లే జీతం పెరుగుతున్న మాట వాస్తవమేగాని—



రెండేళ్ళలో స్కూలు ముగింపుకు వచ్చి అదీ ఆగిపోతుంది.

"ఆల్‌రైట్...రేపొద్దున ఎక్కడో అక్కడ ముష్టెత్తుకొచ్చయినా ఓ దోమ తెర కొనుక్కు వస్తాను గాని...ఈ రాత్రికి కోపం తగ్గించుకొని ఈ దాసుణ్ణి అనుగ్రహించు తల్లీ!"

"ఏం లాభంలేదు...మాట్లాడటానికి వీల్లేదు ... దోమతెర తీసుకొని వస్తేనే...!" చీకట్లోనే మొఖం పక్కకు తిప్పుకొని మురిపెంగా లోలోనే నవ్వుకో సాగింది.

"ఇదుగో నాకు కోపమొస్తోంది!"

"నాకు ఎప్పుడో వచ్చింది!"

రామంకు నిజంగానే కోపం రావటం మొదలయింది.

ఆయిదు నిముషాలు ఆ ప్రదేశాన్ని నిశ్శబ్దం చీకటిలా ఆవరించింది. దూరంగా రోడ్డుమీద వెళుతున్న కారు హారన్ల మ్రోత తప్ప ఏమీ వినబడటం లేదు. ఇంటిముందు వెలుగుతున్న కార్పొరేషన్ దీపపు వెలుగు కిటికీలోంచి గుడ్డిగా లోపల పడుతోంది.

చిరుకోపంలోనే ఎలాగో అలాగ సర్దుకుందాం అన్నట్లుగా సుజాత భుజం మీద చెయివేసి ఊపాడు రామం.

"పైకి పోదాం బాబూ!"

"రేపట్నించి!"

"ఏం ఇవాళ్ళ మంచిదిగాదా!"

"అమావాస్యగదా!"

"రేపు అమావాస్య వెళ్ళిన పాడ్యమి ... అదీ మంచిదిగాదు!" ఎగతాళిగా అన్నది, సుజాత...ఇక మీకు మంచి రోజే దొరకదన్నట్లుగా.

"థాంక్స్యూ!"

రోషంగా సుజాత ముక్కుపుటాలు ఎగరవేసింది.

"మీకు ఎగతాళిగానే వుంటుంది!" అన్నది...రెండు చేతులతో దోమల్ని చంపుతున్నట్లుగా చప్పట్లు చరుస్తున్నా ... అవి చావకపోంగా నొప్పే మిగిలింది.

ఏడుపు వస్తున్నది సుజాతకు. అటు దోమలు...ఇటు భర్త!

వెధవ బ్రతుకు ... తనకు చీరెలు అక్కర్లేదు ... పలహారాలు అక్కర్లేదు... సినిమాలు అక్కర్లేదు...షికార్లు అక్కర్లేదు ...పగలంతా పనిచేసి చేసి రాత్రిపూట పడుకుంటే ... కమ్మగా కంటినిండా నిద్రవుంటే చాలు!

రామం సుజాత నడుంమీద చేయి వేసి తనవైపుకు బలవంతంగా తిప్పుకో ప్రయత్నిస్తూ "చూడవోయ్ అమ్మడూ ... పదకొండు అవుతోంది ... ఇక పడుకోనక్కర్లేదేమిటి ... ఏంఏటా బెట్టు సరి!" అన్నాడు లాలనగా.

సుజాత విసుగ్గా లేచి కూర్చున్నది. "ఎన్నిసార్లు చెప్పించుకుంటారు సిగ్గులేకుండా ... ఒకవైపు చస్తుంటే ... వెధవగోల!"

రామంకు కోపం గుండెల్లోనుంచి పైకి ఎగతన్నింది. "ఛత్! బుద్ధిలేక పోతేసరి......నిన్ను కదిలించడమే నా బుద్ధి తక్కువ ... చస్తే నిన్ను నేను ముట్టుకోను...ఈ జన్మకిక ఇంతే... ఫో! పైన పడుకుంటావో...క్రింద పడుకుంటావో...నీ యిష్టం!" గోడ వైపుకు తిరిగి బలవంతంగా కళ్ళు మూసుకున్నాడు. "వెధవ రోగం......వెధవ రోగం అని...బడిత పూజ చేసేవాళ్ళు లేక బరితెగించిపోతుంది!"

కోపం — కుంపటిమీద గిన్నెలో నీళ్ళలా—కుత కుత లాడిపోతోంది.

'ఏంవిటా పొగరు...ఏం చూసుకొని ఆ పొగరు...వెధవ పొగరు...గొప్ప ...వెధవగొప్ప ... రాత్రయ్యేటప్పటికి ఎప్పుడూ ఏడుపే...వెధవ ఏడుపు... దోమల్ల దోమలు...వెధవ దోమలు... తనకు లేవా...దీనికి ఒక్కదానికేనా... తను పడుకోలా ... చస్తే మాట్లాడ గూడదు ఇంకా ... మరీ లోకువగా చూస్తోంది తనని...దేవేంద్రభవనంలో వెలిగిందా చిన్నప్పటినుంచి...దేవేంద్ర భవనం...వెధవ దేవేంద్ర భవనం ... ఇక మాట్లాడితే ఒట్టే...!"

నిశ్శబ్దం.

భయంకరమైన నిశ్శబ్దం.

సుజాత స్వంతంగా దగ్గరుండి

కట్టించిన ఇంట్లో కొట్టిన మేకులా బిగుసుకుపోయింది.

ఏం అమాత్రం ఓ దోమతెర కొన లేరూ ... బోడి దోమతెర ... ఎన్ని ఖర్చులు పెట్టటంలేదు ... తనకొకవా ల్సింది కొనాలంటేనే వస్తుంది ఎక్కడ లేని ఆలోచనా ... డబ్బులేకపోవట మూనూ ... అంతదాకా ఎందుకు మొన్నటికిమొన్న చెల్లెలు వస్తే—చెల్లెలు వచ్చింది చెల్లాయి వచ్చిందంటూ బొంగరంలా తిరిగి చీరె కొనిపెట్టలా... బోడిచీరె...మా నాన్నకు మరి రెండు ధోవతులు గూడా లేవోయ్—అంటూ సాగదీసి—ఆయనగారికి ఒక ధోవతుల చాపు గూడా కొనిచ్చి పంపలేదూ— పెద్ద తనకేదో బీరువానిండా చీరలు పడిఏడ్చినట్లున్నూ — ఆయనగారేమో ధోవతుల లేక బూడిదరాసుకు తిరుగు తున్నట్లున్నూ — ఏదైనా తనేగా సరా యిది—డబ్బు లేదుట డబ్బు...'

రాత్రి పదకొండున్నరయింది. సుజాతకూ నిద్రపట్టటంలేదు. మన స్సంతా కసిగాను—ఇంత బ్రతుకులోను తాను వెధవ బోడి చిన్న కోరిక నొక దాన్నిగూడా తీర్చుకోలేకపోయినందుకు ఆవేదనగానూ, బాధగానూ వున్నది.

కళ్లెత్తి చీకట్లో భర్తవంక చూచింది —ఆయనకేం మొగమహారాజు ... ఇస్త్రీ చేసిన చొక్కాలా బిగుసుకు పడు కున్నాడు— శుభ్రంగా నిద్ర పట్టేసి వుంటుంది!

అలాగే తనవంకే తిరిగి పడుకున్న ఆయన్ను చూస్తూ పడుకున్నది — ఆ చీకట్లో.

జుట్టంతా పలచబడినట్లనిపిస్తోంది... ఇదివరకటికంటే కాస్త చిక్కినట్లుగూడా వున్నారు ... మొహంలో ఇదివరకటి మెరుపు గూడా లేదేమోననిపిస్తోంది... పెళ్ళయిన కొత్తల్లో ఫోర్ స్క్వేర్ త్రాగే ఆయన—అవి బాగా ఖరీదోయ్ సుజా — అంటూ చార్మినార్ లోకి దిగి పోయారు.

ఎప్పుడూ తెల్లని నలగని గుడ్డల్లో తిరిగే ఆయన ఇప్పుడు ఇస్త్రీ గుడ్డల్ని నాలుగయిదు రోజుల కొకసారి గాని మార్చటంలేదు— ఆ రోజుల్లో ... ఈ బోడి వెధవలు పుట్టకముందు జేబులో పదిరూపాయలు లేందే బయటకు నడిచే వాడు గాదు—అలాంటి ఆయన ఈనాడు ఏ పదిపైసల బిళ్ళో కంటబడితే చాలు పరమానందభరితులై జేబులో వేసుకు వెళ్ళిపోతున్నారు

ఆయన్ను చూస్తూ — గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ—వర్తమానంతో పోల్చుకుంటుంటే జాలివేసింది సుజాతకు బాధవేసింది. ఏడుపు వచ్చింది.

తమ భవిష్యత్తేమిటి?

—పీటన్నిటికి తోడు తనూ మాన సికంగా ఆయన్ను హింసిస్తున్నదా?

జాలిగా అతని రేగిపోయిన జుట్టును సరిచేసేందుకు అన్నట్లుగా అతడి తల వైపుకు చేయి జాచింది.

ఏదో వెలితి? భయంకరమైన వెలితి! — అలాగే అతడి మొహంలోకే కన్నార్పకుండా చూస్తూ పడుకున్నది సుజాత!

రామంకూ నిద్రపట్టలేదు. పడుకొని కళ్ళు మూసుకున్నాడన్న మాటేగాని కోపం—సుజాత మీద కసి అతడికి గుండెల్లోనుంచి ఎగతన్నుతోంది.

అన్నివిషయాల్లోనూ నచ్చుతోంది గానీ — ఇక్కడే మంట — వెధవ పోజును అది...

ఎర్రని ఆమె రూపం—పెద్ద కళ్ళు —నవ్వే పెదిమలు—వత్తైన జడ—. అందుకే వెధవ పొగరు!

తనకుమాత్రం లేదా అలాంటి భార్య వున్నందుకు!

ఆమె రూపం అతడిలో సంచలనాన్ని కలిగించింది. ఆ రూపాన్నే కళ్ళముందు మాటిమాటికి చిత్రీకరించుకుంటుండే కోరిక కోపాన్ని క్షణక్షణానికి ఆక్రమించుకుంటూ — ఏ క్షణానవైనా సంపూర్ణ విజయాన్ని సాధించేలా వున్నది!

ఉహుం...తను లోకువివ్వగూడదు! - ఏం తను మాత్రం అందగాడు గాదా?—తను కాలేజీలో ఉండగా ఎన్ని నాటకాల్లో వేయలేదు...కళ్ళు తిప్పేసే వాడు జనాన్ని?

ఏంవోబాబూ...తనజీవితంలో ఎంతో మంది హీరోయిన్లతో స్టేజీలెక్కాడుగాని —జీవిత నాటకంలో మాత్రం సుజాతకు మించిన హీరోయిన్ తనకుతప్ప మరెవ్వరికీ దొరికి వుండదేమో అనిపిస్తుంది!

మరీ ముత్యాల్లా ఆ పళ్ళు బయట పడ్డప్పుడు—బుగ్గలు ఎంత అందంగా సొట్టలు పడతాయి!

— మాట్లాడకపోతే మాట్లాడక పోవచ్చు గాని—దాని భుజంమీద చేయి వేసుకు పడుకుంటే హాయిగా నిద్ర పట్టేలా వున్నది!

కళ్ళు తెరిచి చీకట్లో సుజాతనే చూస్తూ పడుకున్నాడు.

— ఇందాకటినుంచీ ఏదో తహ తహలో దోమల సంగతే—అది ఎన్ని చెప్పినా పట్టించుకోలేదుగాని — అబ్బ ... తననీ ఒకటి రెండుసార్లు పొడిచి నట్టున్నాయి ... గూడలమీద జిల పుడు తున్నది ఒకటే—నిజమే—పాపం అదీ— అసలే సున్నితమైన శరీరం ... దాన్ని మల్లెపువ్వులా చూసుకోవాల్సింది పోయి అలా దోమలకు వదిలేస్తే—దానికేగాదు ఎవరికైనా వస్తుంది కోపం...

సుజాతనే చూస్తూ—కళ్ళతోనే ఆమె అందాన్ని ఆరాధిస్తూ—పడుకున్నాడు.

అది కొద్దిగా దగ్గరకు జరిగితే బాగుండు...చల్లటిగాలి కొడుతుంది... వాన రాదుగదా!

పెదాలు తడి చేసుకున్నాడు— దాహం అవుతున్నదన్నట్లుగా.

సుజాత మొహం మీద ఎగురుతున్న

ముంగురులు అతడిలోని కోరికల మంటలకు ఆజ్యంపోస్తోంది.

పగలంతా ఇంటెడు చాకిరీ చేసిం దేమో ఇట్టే నిద్రపట్టేసి వుంటుంది...

అలా చూస్తుంటే ఆమె మీద జాలి—అభిమానం — ప్రేమ—ఆమెకు దగ్గరవ్వాలనే కోరిక-తనలోని బలహీనతలా పెరిగిపో సాగినయి.

ఆమె బాధపడుతుంటే—దోమలతో నిద్రపట్టక యిబ్బంది పడుతుంటే అనునయించాల్సింది పోయి తనకేమిటి కోపం...తనే నచ్చచెప్పాలి...సుజాతది పెద్ద కోరికేంగాదు ... రేపు ముందుగా ఓ టార్టాయిస్ ప్యాకెట్ కొనుక్కురావాలి...

అవును—అసలు సుజాతమీద తనకు కోపం రావటమేమిటి...అన్నిటిలోనూ యిద్దరూ ఒకటే...

నాన్సెన్స్...కోపంతో రాత్రిని వేస్ట్ చేయడం వట్టి బుద్ధితక్కువ పని...

చిన్నగా చేయెత్తాడు. ఆమె చేతి వేళ్ళమీద వేశాడు.

అతడినే కన్నార్పకుండా చూస్తున్న సుజాత, "ఇంకా పడుకోలేదా?" అన్నది చిన్నగా.

పన్నెండు గంటలు కొట్టింది ఇంటి వారి గడియారం.

"నిద్ర పట్టటంలేదు!" అన్నాడు నసుగుతున్నట్లుగా రామం.

"ఎందుకనో?"

"తెలియదా రాణీగారికి!"

"పాపం...ప్చ్! కోపం వచ్చిందని బిగుసుకుపోతిరిగా!" అన్నది మురిపెంగా—అతడి తలమీద చేయి జుట్టును చెరిపేస్తోంది.

వాళ్ళిద్దరిమధ్య దూరం దగ్గరయింది.

రామం చేతిలో సుజాత చేయి బిగుసుకుపోదోంది. ఆమె ఎగిరిపోతున్న గుండెల్ని అతడు అదుపులో పెట్ట ప్రయత్నిస్తున్నాడు.

చీకటి మరింత నల్లబడినట్లని పిస్తున్నది.

"సుజాతా డియర్!" అన్నాడు తన గుండెల్లో ఆమె తలను దాచుకుంటూ. "రేపు కొనేస్తాను తప్పకుండా దోమతెర!"

"పోనీయండి వెధవది ... మనకు ఎప్పుడు వీలుచిక్కితే అప్పుడే కొనుక్కుందాం!"

కిటికీలోనుంచి చల్లటి గాలి వీస్తోంది.

'వర్షంకురిస్తే ఎంత బాగుంటుంది!' అనిపించింది ఆ క్షణాన ఇద్దరికీ — ఒకరి బంధాలలో చిక్కుకుపోయిన మరొకరికి.

తలుపు దబదబా మ్రోతయింది.

"అమ్మా! తలుపు ... తలుపు ... పైన చినుకులు పడుతున్నాయి!"

* * *

"నీ యవ్వ ... ఇటు జరుగు!"

అన్నాడు జగ్గడు — రంగి జుట్టు పట్టుకొని దగ్గరకు లాక్కుంటూ—అప్పుడే తాగొచ్చిన ఆనందపు మైకంలో.

రంగి మీదగా సగం తాటాకులు ఎగిరిపోయిన గుడిసెలోనుంచి బయటకు చూస్తే ఆకాశం మీద కనబడుతున్న నక్షత్రాలు—కల్లుకాంపౌండ్‌లో కట్టిన చిన్న బల్బుల తోరణాల్లా వున్నాయి. ఓ పక్కగా ఆకాశంమీద పాకుతున్న తెల్లటి మబ్బు — కుండల్లో కాస్తున్న కాపుసారా మీదగా లేస్తున్న తెల్లటి పొగలా వున్నది. కాస్త దూరంలో వున్న ఆరంతస్థుల మేడమీదకట్టిన టి.వి. ఏన్టీనాలు ఈతచెట్టు ఆకులు విచ్చుకున్నట్లుగా వున్నాయి ... కిటికీలకు అక్కడక్కడా పెట్టిన ఎయిర్ కూలర్లు తాటిచెట్టుకు కట్టిన కల్లుముంతల్లా వున్నాయి.

"నీ యవ్వ! దగ్గరకు జరగవే!"

"ముదనష్టపోడా ... ఏందా గుంజుడు...గొడ్డుననుకుంటున్నావా—మనిషిననుకుంటున్నావా—అంత తిమ్మిరి తగ్గకపోతే ఓ ముంతడు మజ్జిగ తాగి చావరాదూ—ఒకవైపునఆసలే దోమల్తో నే చస్తుంటే!" ఒళ్ళు విదిలించుకుంటూ—దూరంగా జరిగి బిగ్గరగా అరవసాగింది.

ఫెళ్ళున నవ్వాడు జగ్గడు. "నీ యవ్వ ...దోమలా...యెక్కడేవ్... అయినా నాకు తెలియకడుగుతాను — మన రాజభవనంలోకి దోమల్రాక 'ఏనుగులొస్తయ్యేంటీ యెర్రిమొగమా!" ఫెళ్ళున నవ్వాడు — గుర్రబ్బండి మీద తీసుకెళుతున్న కల్లుబాన నడిరోడ్డుమీద పగిలి ముక్కలయినట్లుగా.

"యంహాఫో......దోమలు కుడుతున్నాయి......వాకిట్లో పోయి పండుకుంటా!" లేచి కూర్చున్నది రంగి—జగ్గడిని విదిలించి.

"నీ యవ్వ ...... ఇందాకటినుంచి చూస్తున్నాను...దోమల్దోమలంటావ్... వాకిట్లో పడుకుంటానంటావ్...ఏందేవ్ ...ఎవడైన్నా మిండగాడ్ని మరిగేవేంటి ...ఇక్కడే పండుకోవాల... నాకు లేని దోమలు నీకెక్కణ్ణించి వచ్చినయ్యే ముండా ... యిలాటి వేషాలేశావంటే మక్కెలిరిగతంతా......... ముక్కలు ముక్కలుగా నరికేసి కాకులకి గద్దలికేస్తా ...నీయవ్వ... ఉప్పుపాతరేస్తానేవ్ ... ఒళ్లు దగ్గరపెట్టుకు తొంగో...!"

